## ప్రేమ పేరుతో ఆ మోసగాడు వేసిన వలలో ఆమె చిక్కిందా?

# ప్రేమజంట

వాసం వెంకట్రాజ్ కథ

"డాడీ... ప్లాన్ సక్సెస్. కంప్లీట్లీ సక్సెస్" పరుగెత్తుకుంటూ వచ్చి తండ్రి రామనాథంను కౌగిలించుకుని, సంతోషంగా చెప్పాడు లక్ష్మణ్.

రామనాథం విజయగర్వంతో మీసాన్ని ఎగరేశాడు.

"వెరీగుడ్, మై బాయ్. నువ్వు ప్లాన్ సక్సెస్ చేస్తావని నాకు ముందే తెలుసు. ఇదిగో ఈ ఐదొందలు తీసుకుని, బార్‌షాప్ కెళ్లి ఎంజాయ్ చెయ్యి. అర్రర్రే... అడగడం మర్చిపోయాను. ప్లాన్ కంప్లీట్లీ సక్సెస్ అన్నావు. ఎలా సక్సెస్ చేశావో చెప్పు మై సన్" లక్ష్మణ్ జబ్బను సుతిమెత్తగా వొత్తుతూ అడిగాడు రామనాథం.

"చెప్తాను డాడీ చెప్తాను. కానీ ఇంతకుముందు మీరు ఐదొందలు తీసుకుని బార్‌షాప్ కెళ్లి ఎంజాయ్ చెయ్యమన్నారు. జేబులోంచి ఐదొందలు తీసి ఇవ్వలేదు డాడీ"

రామనాథం ఓసారి తన తలపై తానే గట్టిగా మొట్టికాయ వేసుకుని "సారీ మై బాయ్. ఎమోషన్లో అలా అన్నానుగాని, జేబులోఐదు పైసల బిళ్లకూడా లేదు" అన్నాడు కాస్త విషాదంగా.


"డాడీ పొద్దున మీ జేబులో టూ థౌజండ్ రూపీస్ ఉన్నాయికదా. అంత డబ్బేమైపోయింది డాడీ?"

"అరగంట క్రితం పేకాటాడాను మైసన్. డబ్బంతా పోయింది"

"డాడీ పేకాటాడొద్దని మీకెన్నిసార్లు చెప్పాను?"

"దాదాపు లక్షసార్లు బేటా!"

"కానీ ఒక్కరోజైనా పేకాటాడకుండా



వున్నారా డాడీ?''

"లేను, మై సన్!''

''ఈరోజునుంచైనా పేకాటాడడం మానెయ్యి డాడీ''

''కుదరదు బేటా. పేకాటాడడం మన వంశాచారం. తరతరాలనుంచి మన తాతలు ముత్తాతలు పేకాటాడుతున్నారు. మా తాత పేకాటాడి ఆరొందల ఎకరాల భూమిని

మూడొందలెకరాల భూమిగా మార్చాడు. మా నాన్న పేకాడాడి ఆ మూడొందలెకరాల భూమిని యాభై ఎకరాల భూమిగా మార్చాడు. నేను పేకటాడి ఆ యాభై ఎకరాలనూ పోగొట్టాను. చూశావా మనదెంత గొప్ప చరిత్రో... నువ్వు కూడా పేకాటాడుస్తూ మన వంశగౌరవాన్ని నిలబెట్టు బేటా...''

నిట్టూర్చాడు లక్ష్మణ్. ఓసారి గాఢంగా నిట్టూర్చి ''డాడీ పేకాట చాలా డేంజరస్ ఆట'' అన్నాడు.

''నిజమా బేటా?''

''ఎస్. డాడీ. నా ఫ్రెండొకడు పేకాటాడుస్తూ మాటవరుసకు 'నేను ఓడిపోతే ఆత్మహత్య చేసుకుంటా'నన్నాడు. ఓడిపోయాడు. నిజంగానే ఆత్మహత్య చేసుకున్నాడు.''

''పూర్ ఫెల్లో... నేనోడిపోతే అలా ఎప్పుడూ ఆత్మహత్య చేసుకుంటానని అనను. నా ఆస్తినంతా రాసిచ్చేస్తానంటాను. సరేనా బేటా?''

తల బాదుకున్నాడు లక్ష్మణ్. ''మిమ్మల్ని మార్చడం ఆ దేవుడివల్లకూడా కాదు'' అనుకున్నాడు మనసులో.

''బేటా ప్లానెలా సక్సెస్ చేశావో తొందరగా చెప్పు''

డాడీ మీరు చెప్పినట్లే మారుతీకారు 'అద్దె'కు తీసుకుని 'ఇందిరా పార్కు'కెళ్లాను. ఇందిరా పార్కంటే 'లవర్స్ పార్క్' అని మెడమీద తలకాయవున్న ప్రతిఒక్కరికీ తెలుసని నేను వేరేచెప్పక్కర్లేదనుకుంటాను.

పార్కులో ఓ చెట్టుక్రింద కూర్చున్నాను. ఓ పది నిమిషాల తరువాత, ఓ అమ్మాయి వచ్చి, నాకు పది గజాల దూరంలో వున్న మరోచెట్టుక్రింద కూర్చుంది. నేను ఆమెనుచూపి చిన్నగా నవ్వాను. ఆమె మాత్రం నన్నుచూసి బిగ్గరగా నవ్వింది.

''ఈజిట్?'' ఉత్సుకతగా అన్నాడు రామనాథం.

''ఎస్ డాడీ''

''ఒక్క నిమిషంలో మా ఇద్దరి చూపులు కలిశాయి. రెండోనిమిషానికి పలకరింపుగా మా ఇద్దరి పెదాలు నవ్వాయి. మూడో నిమిషానికి మా మధ్యవున్న పదిగజాల దూరం కరిగిపోయింది. నాలుగో నిమిషానికి ఒకరి వొడిలో ఒకరమున్నాం. ఐదో నిమిషానికి ఇద్దరం కిస్సులు పెట్టుకున్నాం. ఆరో నిమిషానికి 'నువ్వు లేనిదే నేను క్షణమైనా జీవించలేను. డాలింగ్' అని ప్రామిస్ చేసుకున్నాం. ఏడోనిమిషానికి ఐస్క్రీం తిన్నాం. ఎనిమిదో నిమిషానికి ఆమె ఆస్తి వివరాలు అడిగాను. దాదాపు కోటి రూపాయల ఆస్తికి వారసురాలట తను. ఒక్కతే కూతురట. 'ఒక అమ్మ, ఇద్దరు నాన్నలు తప్ప 'నా' అనేవాళ్లే లేరట. వాళ్లమ్మగారు బాగా చదువుకున్న 'అభ్యుదయ మహిళామణి' అట. ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ రఘురామగారి 'జీవిత చరిత్ర' రాద్దామని వెళ్లి, ఆయన 'జీవిత చరిత్ర' చూసి, ఆయన ప్రేమలో పడి, మెళ్లో మరో 'తాళి' కట్టించుకున్న 'తెలుగింటి ఆడపడుచ'ట. తొమ్మిదో నిమిషానికి 'తొందరగా పెళ్లి చేసుకుందాం డియర్' అనందామె. పదో నిమిషానికి నేనుకూడా 'ఓకే' అన్నాను డాడీ''

గట్టిగా అతణ్ని కౌగిలించుకున్నాడు రామనాథం.

"మొత్తానికి కోటీశ్వరాలుని పట్టేశావన్నమాట. తొందరగా ఆ అమ్మాయిని మ్యారేజ్ చేసుకుని, మొదటిరాత్రే ఆమె ఆస్తినంతా నీ పేరున రాయించుకుని, తెల్లారినుంచి మన వంశాచారమైన పేకాటాడడం మొదలుపెట్టు మై బాయ్ ..."

"అలాగే డాడీ... తొందరగా నాకు ఆరు వేలివ్వు. మంచి బట్టలు కొనుక్కుంటాను. రేపు ఆమె వెహ్రా జూపార్కుకి వస్తానంది"


"నాన్సెన్స్... ఏ హోటల్‌కో, సినిమా థియేటర్‌కో వస్తానవాలిగాని, జూపార్కులో ఏముందని ఆ అమ్మాయి వస్తానంది"

"పిచ్చి డాడీ... మీ మెదడింకా పూర్తిగా ఎదగలేదనిపిస్తుంది. జూపార్కులో ఏం లేదని తెలిసే లవర్స్ అందులోకి వెళ్తారు. ప్రేమికులకు కావలసింది రేపో ఎల్లుండో చచ్చిపోయేటట్లుండే జంతువులుకాదు. ఏపుగా పెరిగిన గుబురుపొదలు. ఆ గుబుపొదల చాటున కూర్చుని (పడుకుని కూడా) రొమాన్స్ జరుపుకోవడానికోసమే లవర్స్ అందులోకి వెళ్తారు. 'ప్రేమ'లో పడ్డ సిటీ అమ్మాయిలు 'కాలు' జారి 'వెల' తప్పడానికి అనువైన ప్రదేశం జూపార్కే డాడీ... ఈ మధ్య కొంతమంది అమ్మాయిలు 'డెలివరీ' కూడా అవుతున్నారట. రేపా అమ్మాయితో జూపార్కులో రొమాన్స్ జరిపి, అట్నుంచి ఆటే బిర్లా మందిర్‌కి తీస్కెళ్ళి, దండలు మార్చుకుని పెళ్ళిచేసుకుంటాను డాడీ..."

"నో... బిర్లామందిర్‌లో నువ్వు పెళ్ళిచేసుకుంటే, నీకది మూడో వివాహమని పసిగట్టేస్తాడు పూజారి. కాబట్టి వేరే గుడికెళ్ళి దండలు మార్చుకో బేటా..."

"అలాగే డాడీ... తొందరగా నాకు ఆరు వేలివ్వు"

రామనాథం బీరువాలోంచి ఆరువేలు తీసి అతనికిచ్చి, వంటరూమ్‌కేసి చూస్తూ "ఒసేవ్... జానకీ... తొందరగారావే... నీకొడుకెంత ఎదిగిపోయాడో కళ్ళారా చూద్దువుగాని..." అని కేకేశాడు.



జానకి వంటరూమ్‌లోంచి పరుగున వచ్చింది.

ఏమేవ్... మన పుత్రరత్నం ఎంత ఎదిగిపోయాడో తెల్సా... నాకంటికి హిమాలయాలంత ఎత్తుగా కనిపిస్తున్నాడే... వాడు ఓ కోటీశ్వరాలిని పెళ్లిచేస్కోబోతున్నాడే... ఇంట్లో వంట గ్యాసయిపోతే తొందరగా తెచ్చి పెట్టుకో... ఎప్పటికైనా నీ ముద్దుల మూడో కోడలుపై గ్యాస్‌పోసి నిప్పంటించి చంపేయడానికి పనికొస్తుంది'' అన్నాడు రామనాథం.

ఆమె ఆప్యాయంగా లక్ష్మణ్ తల నిమురుతూ ''అబ్బబ్బ... తొందరగా దాన్ని పెళ్లి చేస్కుని ఇంటికి తీసుకరారా... దానితో నేను మాంచి ఫుట్‌బాల్ ఆటాడుకుంటాను'' అంది గోముగా.

అతను సరేనన్నట్లు తలూపి బయటకు నడిచాడు.

☆ ★ ☆

''మమ్మీ... డాడీ... ఈవిడేనే మీ కోడలు'' తల్లిదండ్రులకు తన భార్యను పరిచయం చేశాడు లక్ష్మణ్.

ఆమె వాళ్లకు వినయంగా నమస్కారం చేసింది.

''ఏమ్మా నీకు చాలా ఆస్తి వుందటకదా. ..'' ఆమె తల నిమురుతూ ఆప్యాయంగా అడిగింది జానకి.

ఆమె జవాబుగా నవ్వింది.

''నీ పేరేంటో చెప్పలేదేంటమ్మాయ్'' అడిగాడు రామనాథం.

''పాకీజా!''

''బ్యూటిఫుల్ నేమ్'' అన్నాడతను.

''మీ అమ్మ పేరు?''

''జ్యోతిలక్ష్మి''

''మరి మీ నాన్నపేరు?'' అడిగింది జానకి.

''రిచర్డ్‌సన్... రఘురామ...'' చెప్పిందామె.

ఆమె రెండుపేర్లు చెప్పేసరికి జానకి, రామనాథం ముఖాలు చూసుకున్నారు.

వాళ్ల కలవరపాటుని గమనించిన లక్ష్మణ్ ''డాడీ... నేనింతకుముందే చెప్పానుకదా ఈవిడకి ఇద్దరు నాన్నలున్నారని...'' అన్నాడు బలవంతంగా నవ్వుతూ.

జానకి అయోమయంగా చూసింది.

''ఒసేవ్... నువ్వలా చూడకు. ఒక్క అమ్మాయికి ఇద్దరు భర్తలుండడం ఇప్పుడు ఫేషనైపోయింది'' అన్నాడు రామనాథం.

ఆ మాటకి ఆమె కొంచెం కుదుటపడింది.

రాత్రి భోజనాలయ్యాక ఇద్దరూ బెడ్‌రూమ్ చేరారు. కాసేపు ముచ్చట్లు, సరసాలు జరిపి ''డాలింగ్... నీ ఆస్తినంతా నా పేరున రాయకూడదూ...'' అని గోముగా అడిగాడు లక్ష్మణ్.

''ఆస్తా...?'' అందామె.

అతను ఉలిక్కిపడ్డాడు.

''అదే కోటిరూపాయల ఆస్తి!'' మెల్లగా చెప్పాడు.

''డియర్... నాకు పది పైసల ఆస్తికూడా లేదు'' అందామె క్యాజువల్‌గా.

అతని గుండె గుభిల్లుమంది.

''మరి పార్కులో కోటి రూపాయల్దాకా ఆస్తి వుందని అన్నావుగా?''

''అప్పుడలా అన్నాను. అలా అనడంవల్లే కదా నువ్వు నన్ను పెళ్లిచేసుకున్నావు.''

"నువ్వు నన్ను మోసం చేశావు డాళింగ్

"నువ్వు మాత్రం నన్ను మోసం చేయలేదూ? నాకు దాదాపు రెండు కోట్లకు పైగా ఆస్తి వుందని చెప్పావు. ఏదీ నీ ఆస్తి చూపించు డియర్..."

అతను నీళ్ల నమిలాడు.

పిచ్చి డాళింగ్! నువ్వు దొంగే!... నేనూ దొంగే!... పార్కులో నువ్వు అబద్ధం చెప్పావని నాకు తెలుసు. నేనుకూడా అబద్ధం చెప్పకుంటే నువ్వు నన్ను పెళ్లిచేస్కోవని గ్రహించి అలా చెప్పాను. నీకింతకుముందే రెండుసార్లు పెళ్లయిందని తెలుసు. నువ్వు నీ ఇద్దరు భార్యల్ని దారుణంగా చంపావనీ తెలుసు. మన 'ప్రేమ జంట' బాగుంది. అనవసరంగా వాగుతూ టైం వేస్టు చేయకుండా లైటార్పేయండి" అందామె.

అతని కళ్లుతిరిగి బెడ్‌పై పడిపోయాడు.

*

